సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



రావత్ దూకుడు..

ఇండియా ఏ జట్టు బ్యాటర్ రావత్ మెరిశాడు. వీరోచిత సెంచరీతో కదం తొక్కాడు.

8లో



విద్యార్థులతో చెలగాటం వద్దు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వ్యవస్థలు ఒక్కొక్కటిగా నిర్వీర్యమవుతూ వస్తున్నాయని మేధావులు మండిపడ్డారు.

8లో

గరిష్టం/కనిష్టం
36.4°/22.5°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పారదర్శకంగా ఉచిత ఇసుక సరఫరా

- కలెక్టర్ టీఎస్ చేతన్



ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా ఉచితంగా ఇసుకను పారదర్శకంగా సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్ జిల్లాలో ఉచిత ఇసుకు సరఫరా చేసేందుకు తీసుకున్న చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజలు ఆన్‌లైన్లో ఉచిత ఇసుకకు దరఖాస్తు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఇసుక రీచుల్లో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రిజిస్టర్ చేసుకున్న వాహనాల ద్వారా మాత్రమే ఇసుక సరఫరా చేసేలా చర్యలు చేపట్టామన్నారు. అవసరమైన ప్రతి వ్యక్తికి ఉచితంగా ఇసుక సరఫరా చేసేలా చూస్తామని చెప్పారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి

రొళ్ల: గ్రామీణా ప్రాంతాల ప్రజలు తపాలాశాఖ ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని హిందూపురం హెచ్‌ఓ పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం మండల పరిధిలోని దొడ్డేరి తపాలా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తే సమాజంలో గుర్తింపు పొందవచ్చన్నారు. కార్పొరేట్ బ్యాంకుల లావాదేవీలకు సరిసమానంగా వినియోగదారులకు పోస్టల్ బ్యాంకింగ్ ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. వివిధ పొదుపు పథకాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చేనేత పట్టు సహకార సంఘాల ఏర్పాటుకు అవకాశం



ప్రశాంతి నిలయం: జిల్లాలోని చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు నూతన చేనేత, పట్టు సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు మంజూరు చేసినట్లు జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ప్రాంతాల్లో 50 మంది, గ్రామీణ ప్రాంతాల్లో కనీసం 30 మంది చేనేత పట్టు కార్మికులతో నూతన సహకార సంఘం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సహకార సంఘాల్లో సభ్యులు తమ చేనేత ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసే స్టాల్స్, ఎగ్జిబిషన్లలో అమ్ముకోవచ్చన్నారు. ఆప్కో ఇతర ప్రభుత్వ సంస్థల నుంచి ఆర్డర్లు కూడా పొందే అవకాశం ఉందని చెప్పారు. చేనేత పట్టు కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సత్యసాయి నీటి సరఫరాకు అవరోధం



గొట్లూరు వద్ద పైపులైనుకు ఎయిర్‌వాల్ ఏర్పాటు చేస్తున్న కార్మికులు

బత్తలపల్లి: సత్యసాయి నీటి సరఫరాకు అవరోధం ఏర్పడింది. గురువారం సత్యసాయి కార్మికులు నీరు వదిలారు. అయితే ధర్మవరం మండలం గొట్లూరు వద్ద బత్తలపల్లి మండలం మాల్యవంతం నుంచి పుట్టపర్తి పైప్‌లైనుకు ఉన్న ఎయిర్‌వాల్ ఫోర్స్‌కు తట్టుకోలేక ఎగిరిపోయింది. దీంతో నీరంతా వృథాగా పోయింది. సమాచారం అందుకున్న సత్యసాయి కార్మికులు అక్కడికి చేరుకుని ఎయిర్ వాల్‌కు మరమ్మతు పనులు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కార్మికులు కష్టపడి పనులను పూర్తి చేశారు. అనంతరం నీటి సరఫరా యథావిధిగా జరిగింది. శుక్రవారం నుంచి గ్రామాలకు నీరు చేరతాయని పేర్కొన్నారు. సత్యసాయి తాగు నీటి పథకం కార్మికులు గత 22 రోజులుగా సమ్మె చేశారు. అయితే సమ్మె విరమించి విధుల్లోకి చేరగానే ఈ ఘటన జరిగింది.

అన్నీ ఉత్తుత్తి హామీలే !

సార్వత్రిక ఎన్నికల ప్రచారంతో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కూటమి నేతలు ఇష్టానుసారం హామీలు గుప్పించారు. అధికారమే ధ్యేయంగా అసలు అవి సాధ్యపడతాయో? లేదో? కూడా ఆలోచించకుండా ప్రగల్భాలు పలికారు. అయితే అధికారం చేపట్టి వందరోజులు పూర్తవుతున్నా కనీసం ఆ హామీల ప్రస్తావన కూడా ఎక్కడా తేవడం లేదు. దీంతో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

- ఎన్నికల ప్రచారంలో శ్రీసత్యసాయి జిల్లాపై కూటమి నేతల హామీల వర్షం
- పెనుకొండ కోటపై ఆలయాన్ని వేగంగా పూర్తిచేస్తామన్న మంత్రి లోకేశ్
- శ్రీసత్యసాయి తాగునీటి ప్రాజెక్టు దత్తత తీసుకుంటానన్న చినబాబు
- కదిరికి చెర్లోపల్లి నుంచి తాగునీటి సరఫరా ఇస్తామన్న సీఎం చంద్రబాబు
- పేరూరు డ్యాంకు ప్రతి ఏడాది నీళ్లు ఇస్తామని వంచన
- ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనా అమలు నిల్



పెనుకొండ కోటపై శిథిలావస్థలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం



సాక్షి, పుట్టపర్తి: ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ప్రస్తుత సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, కూటమి నేతలు శ్రీసత్యసాయి జిల్లా ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కదిరి, పెనుకొండలో చంద్రబాబు హామీలు ఇవ్వగా.. పుట్టపర్తిలో నారా లోకేశ్ ప్రగల్భాలు పలికారు. అలాగే కేంద్ర మంత్రి అమిత్‌షాతో కలిసి ధర్మవరంలో చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలపై ఊదరగొట్టారు. కానీ ఇంతవరకు ఏ ఒక్క హామీ కూడా అమలు చేసిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రజల్లో నమ్మకం కోల్పోయిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

దత్తత.. ఉత్తిదేనా?

యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేశ్ పుట్టపర్తి నియోజకవర్గంలో పర్యటించారు. ఇందులో భాగంగానే శ్రీసత్యసాయి తాగునీటి పథకాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించారు. సుమారు 540 మంది పని చేసే ప్రాజెక్టులో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 800 గ్రామాలకు పైగా తాగునీరు సరఫరా అవుతోంది. కాగా కార్మికులకు సరిగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ముందు వరకూ వైఎస్ జగన్ సర్కార్ వారికి వేతనాలు అందజేసింది. కాగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి కార్మికులు వేతనాల కోసం రోడ్డెక్కారు. ఇంతవరకూ ఇచ్చిన మాట కోసం నారా లోకేశ్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రోజుకో రీతిలో శ్రీసత్యసాయి తాగు నీటి పథకం కార్మికులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ నిర్మాణం ఎప్పుడో?


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పెనుకొండ కోటపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃనిర్మాణానికి రూ.100 కోట్లతో ఇస్కాన్ ప్రతినిధులతో ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగానే భూకేటాయింపుతో పాటు కొండపై రోడ్డును కూడా నిర్మించారు. అయితే ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, సవిత కూడా లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారం చేపట్టి వంద రోజులవుతున్నా.. ఇప్పటి వరకూ ఆలయ నిర్మాణం గురించి ఎలాంటి ప్రస్తావనా చేయలేదు. హామీల సంగతి పక్కనబెడితే.. మంత్రి సవిత అండదండలతో అరాచకాలు పెరిగిపోయాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'కదిరి' వాసుల దాహం తీర్చరా?

ఎన్నికల ప్రచారంలో భాగంగా చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి కదిరికి తాగునీళ్లు తీసుకొచ్చి ప్రజలకు నీటి సమస్యలేకుండా చేస్తామని ప్రస్తుత సీఎం చంద్రబాబుహామీ ఇచ్చారు. కానీ ఇంతవరకూ ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అలాగే సూపర్ సిక్స్ పథకాల గురించి ధర్మవరం, కదిరి సభలో చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రి అమిత్‌షా ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. అందులోనూ ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు.



బత్తలపల్లిలో నిరసన తెలియజేస్తున్న సత్యసాయి కార్మికులు (ఫైల్)



చెర్లోపల్లి రిజర్వాయర్

పరిశ్రమలెక్కడ బాబూ?



ఎన్నికల సమయంలో రాప్తాడు నియోజకవర్గానికి ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. ఈ నియోజకవర్గం మీదుగానే హైదరాబాద్- బెంగళూరు 44వ జాతీయ రహదారి వెళ్తోంది. ఈ రహదారి పక్కన పరిశ్రమలు ఏర్పాటు చేయించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి దాకా పరిశ్రమల ఊసే ఎత్తలేదు.

– ఈశ్వర్, నరసంపల్లి, కనగానపల్లి మండలం

పేరూరు డ్యాంకు నీళ్లివ్వాలి



హంద్రీనీవా కాలువ ద్వారా ప్రతి యేటా నియోజకవర్గంలోని పేరూరు డ్యాంకు నీరు తీసుకొస్తామని ఎన్నికలప్పుడు చంద్రబాబు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి, మంత్రులతో పాటు స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత కూడా ఇంతవరకూ ఈ హామీ గురించి పట్టించుకోవటం లేదు.

– రాజేష్ ,పేరూరు, రామగిరి మండలం

హామీలన్నీ నీటి మీద రాతలే..



ఎన్నికల సమయంలో ధర్మవరంలో జరిగిన బహిరంగ సమావేశంలో కేంద్ర మంత్రి అమిత్‌షాతో కలిసి సత్యకుమార్, పరిటాల శ్రీరాం ఉన్న వేదికపై చంద్రబాబు ఎన్నో హామీలు ఇచ్చారు. కానీ ఇప్పటి వరకూ ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. చంద్రబాబు హామీలు నీటిమీద రాతలేనని ప్రజలు ఇప్పటికైనా గ్రహించాలి.

– అమర్‌నాథ్‌రెడ్డి, ధర్మవరం

మాటిచ్చారు.. మర్చిపోయారు



ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి కదిరి ప్రాంతానికి నీళ్లు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ హామీ అమలు గురించి మాత్రం ప్రస్తావనే లేదు. చెర్లోపల్లి రిజర్వాయర్‌కు వాటర్ గ్రిడ్ మంజూరు చేయాలి. ఇక్కడ ఫిల్టర్ పాయింట్ ఏర్పాటు చేస్తే కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాలకు శుద్ధజలాలు అందించవచ్చు.

– నారపరెడ్డి, సర్పంచ్, చలమకుంట్లపల్లి

చివరి ఆయకట్టుకు నీరందకపోతే ఎలా?





మాట్లాడుతున్న మంత్రి కేశవ్, చిత్రంలో మంత్రి సత్యకుమార్, కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, హాజరైన ఎమ్మెల్సీ ప్రజాప్రతినిధులు

- కార్యాలయాల్లో కూర్చొని ఏం చేస్తున్నారు
- ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- ఐఏబీ సమావేశంలో అధికారులకు ఆర్థికశాఖ మంత్రి కేశవ్ ఆదేశం

అనంతపురం సెంట్రల్: గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని చివరి ఆయకట్టుకు నీరందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించారు. కర్నూలు, వైఎస్సార్ జిల్లాల ప్రజాప్రతినిధులు సమావేశానికి గైర్హాజరయ్యారు.జిల్లా ప్రజాప్రతినిధుల కోసం ఏకంగా గంటన్నర ఎదురుచూడాల్సి వచ్చింది. ఆర్థికశాఖ మంత్రి కేశవ్‌తో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఐఏబీ చైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది టీబీ డ్యాం నుంచి 26.368 టీఎంసీలు హెచ్చెల్సీకి కేటాయించారని తెలిపారు. 10 టీఎంసీలు తాగు నీటికి, 16 టీఎంసీలు సాగునీటికి వెచ్చించనున్నట్లు వివరించారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఆయకట్టుకు నీరందని చోటే కాకుండా అందుతున్న ప్రాంతాల్లోనూ రైతులకు సంతృప్తి లేదన్నారు. 300 క్యూసెక్కుల లోపే నీటిని విడుదల చేస్తుండటంతో నష్టపోతున్నారన్నారు. కార్యాలయాల్లో అధికారులకు ఎలాంటి పనులు లేవని, హెచ్చెల్సీ అధికారులే కాకుండా హంద్రీనీవా, మైనర్ ఇరిగేషన్ అధికారులు కూడా నీటి పంపిణీలో భాగస్వాములు కావాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఫొటోలను కలెక్టర్‌కు పంపాలని సూచించారు. మిడ్‌పెన్నార్ సౌత్, నార్త్ కెనాల్స్‌కు ఈనెల 23 నుంచి నీరివ్వాలని ఆదేశించారు. ఈనెల 22న జిల్లాలో ప్రాజెక్టుల పరిశీలనకు నీటిపారుదల శాఖ మంత్రి రామానాయుడు వస్తున్నట్లు తెలిపారు.

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ పీఏబీఆర్ కుడి కాలవ ద్వారా ధర్మవరం చెరువును నింపాలని కోరారు. చివరి ప్రాంతాలకు సక్రమంగా నీరు చేరడం లేదని, అధికారులు ఉదాసీనత వీడాలని సూచించారు.
- ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద చివరి ఆయకట్టుకు నీరు రాక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గతేడాది కూడా మిరప సాగు చేసుకుని నష్టపోయారని గుర్తు చేశారు. ఈ సారి పంటలు పండితేనే ఆ ప్రాంత రైతులకు తినడానికి తిండి దొరుకుతుందని పేర్కొన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపడుతున్న సమయంలో భూగర్భ జలాల వృద్ధి కోసం కాలువ అడుగుభాగాన లైనింగ్ చేయరాదని సూచించారు.
- తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి మాట్లాడుతూ మిడుతూరు వద్ద కాలువ మరమ్మతులు చేపట్టాలని, చాగల్లు నుంచి పెండేకల్లు మార్గంలో కూడా ఇలాంటి పరిస్థితే ఉందని వివరించారు. తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్‌కు వారం రోజులు ఆలస్యమైనా ఫర్వాలేదు కాలువల్లో పూడికతీత, మరమ్మతులు చేయాలని కోరారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు



అనంతపురం సిటీ: జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు శుక్రవారం అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. గతంలో రెండు రోజుల పాటు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించేవారు. అయితే ఈసారి ఒకే రోజు అన్ని సంఘాల సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. స్థాయీ సంఘం-1, 2, 3, 4, 5, 6, 7(ఆర్థిక, ప్రణాళిక/గ్రామీణాభివృద్ధి/వ్యవసాయం/విద్య, వైద్య/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు జెడ్పీలోని ప్రధాన సమావేశ మందిరంలో జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సహా ఆయా స్థాయీ సంఘాల చైర్‌పర్సన్లు, సభ్యులు, అధికారులు హాజరు కానున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...?

ఏడు నెలల తరువాత జెడ్పీ స్థాయీ సంఘాలు నిర్వహిస్తుండడం గమనార్హం. గతంలో ఫిబ్రవరి 29న సమావేశాలు నిర్వహించారు. అయితే గత సమావేశంలో అప్పటి సీఈఓ/ఐఏఎస్ అధికారిణి వైభోమ్ నిధియాదేవి, డిప్యూటీ సీఈఓ లలితా బాయి వ్యవహార శైలిని తప్పుబడుతూ సభ్యులందరూ మూకుమ్మడిగా సమావేశాలు బహిష్కరించారు. ఈ క్రమంలోనే ఎన్నికలు రావడంతో ఇదే అదనుగా భావించి అధికారులు కూడా స్థాయీ సంఘాల సమావేశాల నిర్వహణను గాలికి వదిలేశారు. మరో వైపు ఫిబ్రవరి 29న సభ్యులు వాకౌట్ చేసినా... ఆ సమావేశాన్ని నిర్వహించినట్లు జెడ్పీ అధికారులు తప్పుడు రికార్డులు సృష్టించడంపై పంచాయతీ రాజ్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా వెళ్లాయి. ఇటీవల జెడ్పీ సీఈఓగా బాధ్యతలు తీసుకున్న ఓబుళమ్మ జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో మాట్లాడారు. ఈ క్రమంలోనే స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిస్తుండడం గమనార్హం.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

పరిగి: 'దుకాణాల్లోని వస్తువులు, పదార్థాలను ఎమ్మార్పీ ధరకంటే అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే తూనికలు, కొలతల్లో తేడాలుంటే శాఖాపరమైన చర్యలు తప్పవు' అని తూనికల కొలతలశాఖ అధికారి శివశంకర్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన పలు దుకాణాలు, అంగళ్లలో తనిఖీలు చేపట్టారు. ఇటీవల వంట నూనె ధరల పెరగడంతో విక్రయాలపై ప్రత్యేకంగా తనిఖీలు చేశారు. ఎమ్మార్పీ కన్నా అధిక రేట్లకు విక్రయించేందుకు దుకాణదారులు యత్నిస్తున్నారన్న ఫిర్యాదులపై తనిఖీలు చేసినట్లు శివశంకర్ తెలిపారు. ఈ క్రమంలో ఆయిల్ ప్యాకెట్ ధర రూ.108 ఉండగా కొందరు దుకాణదారులు రూ.120 వరకూ విక్రయించినట్లు గుర్తించామన్నారు. అలాగే కిరాణా వస్తువులు సైతం అధిక ధరలకు అమ్ముతున్నట్లు తేల్చామని పేర్కొన్నారు. ఈక్రమంలో పలు దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సైబర్ ఉచ్చులో పడకండి

- విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్పీ రత్న



సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ రత్న, అడిషనల్ ఎస్పీ ఎ.శ్రీనివాసులు

ధర్మవరం అర్బన్: 'సైబర్ నేరాల ఉచ్చులో పడి ప్రతి ఒక్కరూ మోసపోతున్నారు. మోసం, అన్యాయం జరిగేది అంతా అరచేతిలో ఉండే మొబైల్ ఫోన్ల ద్వారానే. సైబర్ నేరస్తుల వలలో పడకుండా జాగ్రత్తలు పాటించాలి' అని ఎస్పీ వి.రత్న సూచించారు. ధర్మవరం పట్టణంలో గురువారం సైబర్ నేరాలపై కళాశాలల విద్యార్థులతో పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ రత్న, అడిషనల్ ఎస్పీ ఎ.శ్రీనివాస్, డీఎస్పీ శ్రీనివాసులు హాజరై పట్టణంలోని కాలేజీ సర్కిల్ నుంచి షిర్డిసాయిబాబా కల్యాణ మండపం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 2,543 సైబర్ కేసులు వచ్చాయని, వాటిలో ఇప్పటికే 66 కేసులు అటెండ్ చేశామన్నారు. కొన్ని కేసుల్లో డబ్బులు రికవరీ చేశామని, మరికొన్ని కేసుల్లో డబ్బులు సైబర్ నేరగాళ్లకు చేరకుండా హోల్డ్ చేశామన్నారు. డిజిటల్ అరెస్టు స్కామ్, సైబర్ స్కామ్‌లలో ఏఐ డీప్‌ఫేక్‌లు, రివార్డు పాయింట్‌లు, కేవైసీ అప్‌డేట్, స్టాక్ మార్కెట్, ట్రేడింగ్ పెట్టుబడి, క్రెడిట్ కార్డులు, హనీట్రాప్ తదితర సైబర్ మోసాల నుంచి విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు ముందుకు వచ్చి సైబర్ వారియర్స్, సైబర్ ప్రొటెక్టర్స్‌గా తయారుకావాలన్నారు. మరో పదిమందికి సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తే ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ ఆర్ఎస్ఐ వేణుగోపాల్, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, టూటౌన్ సీఐ రెడ్డప్ప, రూరల్ సీఐ ప్రభాకర్, చెన్నేకొత్తపల్లి సీఐ శ్రీధర్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్, రూరల్ ఎస్ఐ నరేంద్ర, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి కియా చేయూత

- రూ.5 కోట్ల విలువ చేసే వైద్య సామగ్రి అందజేత



కియా సీఏఓ డాంగ్‌లీని సన్మానిస్తున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి కియా కంపెనీ చేయూత అందించింది. గురువారం రూ.5 కోట్ల విలువ చేసే హెచ్‌డీ ఐవస్, రోటా ప్రొ, ఎఫ్ఎస్ఆర్ తదితర వైద్య సామగ్రి అందజేసింది. ఈ సందర్భంగా కియా ఇండియా సీఏఓ డాంగ్‌లీని మంత్రి సత్యకుమార్ సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కియా తరహాలో అన్ని కంపెనీలు ప్రభుత్వాస్పత్రికి చేయూతనివ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రత్యేక నిధుల కోసం అంతర్జాతీయ ఏజెన్సీ ద్వారా కృషి చేస్తామన్నారు. ఆర్థిక వనరుల కొరత ఉన్నందున పరిమితులను దృష్టిలో ఉంచుకుని కేంద్రం నుంచి సహకారం కోరుతున్నామన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలందించి ఆరోగ్యానికి ఆంధ్రప్రదేశ్‌ను చిరునామాగా మార్చుతామన్నారు. ప్రతి సీహెచ్‌సీలో రూ. 45 వేల విలువ చేసే గుండె సంబంధిత మందులను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. 0-18 ఏళ్ల పిల్లలకు వచ్చే నెలలో 44 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజనాస్పత్రి పడకల సంఖ్యను 1,200కి పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి బలవన్మరణం

నల్లచెరువు: ఒంటరి జీవితాన్ని తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... నల్లచెరువు మండలం చిన్నయల్లంపల్లికి చెందిన వాసూనాయక్ (35)కు నా అనే వారు ఎవరూ లేరు. చిన్నాచితక పనులు చేసుకుంటూ స్థానిక బస్సు షెల్టర్‌లోనే తల దాచుకునేవాడు. ఇటీవల అనారోగ్యానికి గురైన వాసూనాయక్... ఒంటరి జీవితాన్ని తాళలేక జీవితంపై విరక్తితో బుధవారం రాత్రి బస్ షెల్టర్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వీఆర్వో మృతి

చిలమత్తూరు: మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీ వీఆర్వో శ్రీనివాసులు గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. మూడు రోజుల క్రితం గుండెపోటుకు గురై అపస్మారక స్థితికి చేరుకున్న ఆయనను కుటుంబసభ్యులు అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే కర్నూలులోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు సహకరించక గురువారం తెల్లవారుజామున ఆయన మృతి చెందడంతో అదే రోజు ఆయన స్వగ్రామం పరిగి మండలం శాసనకోటలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, వీఆర్వో మృతి చెందినట్లుగా తెలుసుకున్న చిలమత్తూరు తహసీల్దార్ ఆనందబాబు, వీఆర్వోలు, దేమకేతేపల్లి సర్పంచ్ ఈడిగ తిరుమలేష్... శాసనకోటకు వెళ్లి శ్రీనివాసులు మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు తల్లికి సర్పంచ్ తిరుమలేష్ ఆర్థిక సాయం అందజేశారు.

వైద్య విద్యార్థులతో చెలగాటం వద్దు

- వైద్య విద్య సీట్ల భర్తీని వ్యతిరేకించడంపై భగ్గుమన్న మేధావులు
- రౌండ్ టేబుల్ సమావేశంలో కూటమి సర్కార్ తీరుపై ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత కోటా సత్యనారాయణ

పుట్టపర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వ్యవస్థలు ఒక్కొక్కటిగా నిర్వీర్యమవుతూ వస్తున్నాయని మేధావులు మండిపడ్డారు. ఇందులో భాగంగానే తాజాగా వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసే దిశగా కూటమి సర్కార్ పావులు కదుపుతూ పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. వైద్య విద్య సీట్ల భర్తీని కుదించేలా ఎన్ఎంసీకి చంద్రబాబు ప్రభుత్వం రాసిన లేఖపై గురువారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు, మేధావులు పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వం మెడలు వంచైనా.. వైద్య విద్యను సాధిద్దామని పిలుపునిచ్చారు.

ఆశలపై నీళ్లు...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 17 నూతన వైద్య కళాశాలలకు అప్పటి సీఎం వైఎస్ జగన్ అనుమతులు సాధించారు. ఈ క్రమంలో ఇప్పటికే ఐదు కళాశాలలు ప్రారంభం కాగా వీటిలో 730 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ఎన్ఎంసీ అనుమతులు జారీ చేసింది. అయితే ఆయా కళాశాలలను ప్రారంభిస్తే వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందని భావించిన సీఎం చంద్రబాబు పథకం ప్రకారం కుట్రకు తెరలేపారు. నూతనంగా నిర్మించిన వైద్య కళాశాలల్లో మౌలిక వసతులు లేవని, బోధనా సిబ్బంది కొరత ఉందంటూ సాకులు చూపి వాటిని నిర్వహించలేమంటూ ఎన్ఎంసీకి లేఖ రాయడం ద్వారా పేద, మధ్య తరగతి విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లారు.

ప్రభుత్వం పునరాలోచించాలి..

రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ నేత కోటా సత్యనారాయణ మాట్లాడుతూ.. వైద్య సీట్ల భర్తీని రద్దు చేయాలని కోరుతూ ఎన్ఎంసీకి కూటమి ప్రభుత్వం లేఖ రాసి సరిదిద్దుకోలేని తప్పిదం చేసిందని మండిపడ్డారు. పొరుగున ఉన్న కర్ణాటకలో ఎలాంటి నూతన కళాశాలలను తమ పార్టీకి చెందిన ప్రభుత్వం నిర్మించకపోయినా... 400 సీట్ల భర్తీకి ఆమోదం సాధించిందన్నారు. ఏపీలో పేద విద్యార్థులకు వైద్యవిద్యను చేరువ చేసేందుకు గత సీఎం వైఎస్ జగన్ 17 కొత్త మెడికల్ కళాశాలలకు అనుమతులు సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. అభివృద్ధి విషయంలో అధికార పక్షం పట్టింపులకు పోరాదని హితవు పలికారు. కేవలం గత ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం మానుకోవాలన్నారు.

పేద విద్యార్థుల నెత్తిన కత్తి



కొత్త మెడికల్ కళాశాలలకు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ 730 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేసింది. వైద్య సీట్లు మాకొద్దంటూ కూటమి ప్రభుత్వం లేఖ రాసింది. దీంతో పేద విద్యార్థులకు వైద్య విద్య అందదు. వైఎస్సార్, వైఎస్ జగన్ ఇద్దరు విద్యా వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. పేదలకు ఉచితంగా విద్యను అందించారు. కూటమి సర్కార్ ఆ విధానాలకు తిలోదకాలిచ్చి పేద విద్యార్థుల కడుపుకొడుతోంది.

– తుంగా ఓబులపతి, మున్సిపల్ చైర్మన్ పుట్టపర్తి

ఉద్యమాలు తప్పవు



గతంలో జగన్ సర్కార్ విద్యా వైద్య రంగాలకు పెద్ద పీట వేసింది. అందులో భాగంగా కొత్తగా 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేయించారు. ఈ ఏడాది కొత్త కళాశాలల్లో 730 ఎంబీబీఎస్ సీట్లు కేటాయిస్తూ ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఉత్తర్వులు ఇచ్చింది. వసతులు, సిబ్బంది లేరన్న సాకుతో 730 సీట్లు మాకొద్దని కూటమి సర్కార్ లేఖ రాసింది. విద్యా వైద్య విద్యను అడ్డుకుంటే కూటమి సర్కార్‌పై ఉద్యమాలు, పోరాటాలు చేసి సీట్లు సాధించుకుంటాం

– నారాయణ రెడ్డి, మాజీ కౌన్సిలర్, పుట్టపర్తి

అన్యాయం చేస్తే ఊరుకోం



చంద్రబాబు ఆధ్వర్యంలో నిరంకుశ పాలన సాగుతోంది. కొత్త మెడికల్ కళాశాలలకు మంజూరైన సీట్లు వద్దని చెప్పడం పేద విద్యార్థుల కుటుంబాల్లో చీకట్లు నింపడమే. ఉజ్వల భవిష్యత్తు ఉన్న పేద విద్యార్థులు ప్రభుత్వ నిరంకుశ నిర్ణయంతో వైద్య సీట్లు కోల్పోతున్నారు. కూటమి సర్కార్ వైద్య విద్యను ప్రైవేట్ పరం చేసి పేద విద్యార్థులను ఇబ్బంది పెడుతోంది. ఇలా కక్ష సాధింపులకు పాల్పడి పేద విద్యార్థులకు అన్యాయం చేస్తే ఊరుకోం.

– నరసారెడ్డి, వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి రూరల్ మండల కన్వీనర్

ప్రభుత్వం మెడలు వంచుదాం



కూటమి సర్కార్ వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రయత్నిస్తోంది. దీంతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు భారీగా నష్టపోతారు. పేద విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. ఇప్పటికే కొత్తగా మంజూరైన కళాశాలలను ప్రయివేట్ వాళ్లకు అప్పగించేందుకు కుట్రలు పన్నుతోంది. పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించాలంటే ఎంబీబీఎస్ సీట్లు తిరిగి సాధించేందుకు కూటమి సర్కార్ కృషి చేయాలి. లేకపోతే ప్రభుత్వం మెడలు వంచి ఎంబీబీఎస్ సీట్లు సాధించుకుంటాం

– పైపల్లి గంగాధర్, సీపీఎం నేత, పుట్టపర్తి

పేదలకు అన్యాయం చేయొద్దు



వైఎస్సార్, జగన్‌పై ఉన్న ద్వేషం, కక్షతో కూటమి ప్రభుత్వం ఎంబీబీఎస్ సీట్లు వద్దని లేఖ రాసింది. పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో కొత్తగా మంజూరైన 730 వైద్య సీట్లు కోల్పోతారు. దీంతో ఎక్కువ ర్యాంకు వచ్చిన వారు సీటు రాదని నిరాశ చెందుతున్నారు. మేనేజ్‌మెంట్ సీటు కావాలంటే రూ.కోట్లు కట్టి చదవాలి. అలా ఎంత మంది వైద్య విద్య చదువుతున్నారు? ఈ విషయాలన్నీ కూటమి ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని వైద్య సీట్లను వెనక్కు తీసుకొచ్చి విద్యార్థులకు న్యాయం చేయాలి. లేకపోతే ఉద్యమాలు చేసేందుకు సిద్ధమవుతాం

– శ్రీధర్‌రెడ్డి ఎంపీపీ, బుక్కపట్నం

విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు



కూటమి ప్రభుత్వం ఎంబీబీఎస్ సీట్లు వద్దని చెప్పి పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. ఇది కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్ర. వైఎస్ జగన్ పులివెందులతో పాటు కొత్త మెడికల్ కాలేజీలను యుద్ధ ప్రాతిపదికన నిర్మించారు. గత ప్రభుత్వంలో 17 వైద్య కళాశాలలు మంజూరు అయ్యాయి. కొత్తగా మంజూరైన 730 సీట్లు మాకొద్దని కూటమి సర్కార్ వెనక్కు పంపడం కుట్రకు నిదర్శనం. కేవలం జగన్‌కు మంచి పేరు వస్తోందనే కారణంతో ప్రభుత్వం నీచమైన నిర్ణయం తీసుకుంది

– ఆవుటాల రమణారెడ్డి, జిల్లా మాజీ అగ్రి అడ్వైజరీ బోర్డు అధ్యక్షుడు, పుట్టపర్తి

పోలీసుల పేరుతో డాక్టర్‌కు టోకరా

- రూ.33 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- ఆరుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

ధర్మవరం అర్బన్: వాట్సాప్ వీడియో కాల్ ద్వారా తాము ముంబయి పోలీసులమంటూ బెదిరించి ధర్మవరంలోని ఓ వైద్యుడి నుంచి రూ.33 లక్షలను కాజేసిన సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ వి.రత్న వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 18న ధర్మవరానికి చెందిన డాక్టర్ తరుగు సూర్యనారాయణరెడ్డికి 9177597242 నంబర్‌తో వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. అగంతకుడు తాను ముంబయి పోలీసు విభాగం నుంచి మాట్లాడుతున్నట్లుగా తెలిపాడు. నరేష్ గోయల్ అనే వ్యక్తి కెనరా బ్యాంకు ద్వారా రూ.500 కోట్లు అప్పుగా తీసుకుని, ఆ డబ్బు సంస్థకు వాడకుండా వివిధ ఖాతాల్లో జమ చేశాడని, ఇందులో మీ అకౌంట్ కూడా ఉందంటూ డాక్టర్‌ను బెదిరించాడు. రూ.20 లక్షలు తీసుకున్నట్లుగా కేసు నమోదైనట్లుగా తెలిపాడు. డాక్టర్ నమ్మక పోవడంతో డాక్టర్‌కు సంబంధించి తన వద్ద ఉన్న నకిలీ ఆధార్ కార్డు, నకిలీ బ్యాంక్ స్టేట్‌మెంట్, ఫేక్ డెబిట్‌కార్డు చూపించి నమ్మించాడు. ధర్మవరానికి వచ్చి డాక్టర్‌తో పాటు కుటుంబసభ్యులనూ అరెస్ట్ చేసి ముంబయికి తీసుకెళతామని బెదిరించాడు. ఈ కేసు నుంచి బయటపడాలంటే రూ.33 లక్షలు చెల్లించాలని సూచించాడు. అప్పటికే బెదిరింపులతో బెంబేలెత్తిన డాక్టర్ అనాలోచితంగా ఆగస్టు 20న స్థానిక బ్యాంక్ ఖాతా నుంచి రూ.20 లక్షలను ఆర్‌టీజీఎస్ ద్వారా వారు చెప్పిన బ్యాంకు ఖాతా 8856210000018823 (మంగమద్దల ఎంటర్‌ప్రైజెస్)కు బదిలీ చేశాడు. అనంతరం ఐడీబీఐ నుంచి అదే అకౌంట్‌కు మరో రూ.13 లక్షలు జమ చేశాడు. రెండు రోజుల తర్వాత తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు నిర్ధారించుకుని ఆగస్టు 22న ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైం సీఐ తిమ్మారెడ్డి పక్కా ఆధారాలతో సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దాసి ఇలియాజర్, పుట్లంపల్లి మండలం శివానందపురం గ్రామానికి చెందిన నగలరావు స్వామిదాసు, నంద్యాల జిల్లా అయ్యలూరుమెట్టకు చెందిన మంగమద్దెల ప్రహ్లాద్, ఆళ్లగడ్డ మండలం యాదవాడ గ్రామానికి చెందిన బెలగడ కిషోర్, నంద్యాలలోని వెంకటచాలం కాలనీకి చెందిన అల్లు అంబిరెడ్డి, బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గూడపల్లి గ్రామానికి చెందిన జావీద్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఎస్పీ రత్న అభినందించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాసులు, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

స్క్రూడ్రైవర్‌తో పొడిచి.. గొంతు పిసికి!

- వ్యక్తి అనుమానాస్పద మృతి కేసులో వీడిన మిస్టరీ
- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే హత్య
- హతుడి భార్యతో పాటు ఆమె ప్రియుడి అరెస్ట్

కదిరి అర్బన్: ఈ నెల 9న వెలుగు చూసిన వ్యక్తి అనుమానాస్పద మృతి కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధానికి అడ్డు చెప్పాడనే కారణంతో ప్రియుడితో కలసి భర్తను భార్య హతమార్చింది. ఈ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ వెల్లడించారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం నెలపట్ల గ్రామానికి చెందిన మరాఠి రమేష్ (34) తన మేనల్లుడు సతీష్‌తో కలసి కొన్నేళ్ల క్రితమే వలస వచ్చి కుమ్మరవాండ్లపల్లిలో స్థిరపడ్డాడు. గ్రామాల్లో తిరుగుతూ స్టీల్, సిల్వర్ సామగ్రి విక్రయించి జీవనం సాగించేవారు. ఈ నెల 8న రాత్రి తన భర్త అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు భార్య రమ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే మృతదేహంపై గాయాలు ఉండడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు... రమేష్ హత్యకు గురైనట్లు నిర్ధారించారు. దీంతో సీఐ మోహన్ నేతృత్వంలో పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు. రమ్య ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. కుమ్మరవాండ్లపల్లికి చెందిన గంగరాజుతో రమ్య వివాహేతర సంబంధం కొనసాగిస్తుండేది. ఈ విషయం భర్తకు తెలియడంతో పద్ధతి మార్చుకోవాలని భార్యను పలుమార్లు హెచ్చరించాడు. అయినా ఆమె ప్రవర్తనలో ఏ మాత్రం మార్పు రాలేదు. ఈ నెల 8న గంగరాజుతో రమ్య వీడియో కాల్‌లో మాట్లాడుతుండడం గమనించిన రమేష్... ఆమెను తీవ్రస్థాయిలో మందలించాడు. మాటామాట పెరగడంతో చెయ్యి చేసుకున్నాడు. ఈ విషయాన్ని అవతల ఫోన్‌లో ఉన్న గంగరాజు చూసి అదే రోజు రాత్రి రమేష్ ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రమేష్‌తో గొడవపడి కత్తితో ఛాతిపై పొడిచాడు. వెనువెంటనే రమ్య స్క్రూడ్రైవర్ తీసుకుని భర్త శరీరంపై విచక్షణారహితంగా దాడి చేస్తుండగా పక్కనే ఉన్న గంగరాజు... రమేష్ గొంతు పిసికి హతమార్చాడు. అనంతరం చుట్టుపక్కల వారికి ఎవరికీ అనుమానం రాకుండా సోమవారం తెల్లవారుజామున భర్త మృతదేహాన్ని కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే రమేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. అతిగా మద్యం సేవించి తన భర్త మృతి చెందినట్లుగా అందరితో పాటు పోలీసులనూ రమ్య నమ్మించింది. చివరకు పోస్టుమార్టం నివేదికలో అసలు వాస్తవం బహిర్గతం కావడంతో రమ్యతో పాటు గంగరాజును గురువారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు ప్రణాళికలు సిద్ధం చేయండి

- జిల్లా అధికారులను ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ టీఎస్ చేతన్, తదితరులు

ప్రశాంతి నిలయం: స్వర్ణాంధ్ర - 2047 లక్ష్య సాధనకు జిల్లా స్థాయి ప్రణాళికలు రూపొందించుకుని వాటిని మండల, మున్సిపల్ స్థాయిల్లో ఆచరించేలా కార్యాచరణను సిద్ధం చేయాలని జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లా నుంచి కలెక్టర్ టీఎస్ చేతన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... వికసిత్ భారత్‌తో భాగంగా స్వర్ణాంధ్ర -2047 లక్ష్య సాధనకు మండల స్థాయి ప్రణాళికలను ఈ నెలాఖరుకు అందజేయాలని సూచించారు. అలాగే జిల్లా స్థాయి నివేదికను అక్టోబర్ 15 లోపు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైల్వే పోలీసుల అదుపులో సైబర్ నేరగాళ్లు

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం ఉదయం ఇద్దరు సైబర్ నేరగాళ్లను అనంతపురం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ధర్మవరానికి చెందిన ఖాదర్‌బాషాతో పాటు మరో వ్యక్తి ఉన్నాడు. నిందితులను అనంతపురానికి తరలించి లోతైన విచారణ చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

చెర్లోపల్లి వద్ద మృతదేహం

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ చెర్లోపల్లి సమీపంలో ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రంగడు యాదవ్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. అక్కడ లభించిన ఆధారాలను బట్టి మృతుడిని హిందూపురంలోని ధర్మపురం ప్రాంతానికి చెందిన గొల్ల ఆంజనేయులుగా నిర్ధారించారు. ఓ ప్రైవేటు కళాశాలలో అటెండర్‌గా పని చేస్తున్న ఆయన బీపీ, షుగర్, వెన్నునొప్పితో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. బుధవారం రాత్రి చెర్లోపల్లి సమీపంలోని పెద్దన్నకుంట వద్ద దుర్వాసన వస్తుండడంతో స్థానికులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మూడు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకోవడంతో మృతదేహం కుళ్లి, ఉబ్బిపోయి ఉంది. అక్కడ లభ్యమైన సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి ఆచూకీని గుర్తించి సమాచారం ఇవ్వడంతో సోదరుడు గొల్ల అశ్వత్థనారాయణ అక్కడకు చేరుకుని నిర్ధారించాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

హిందూపురం: మండలంలోని నక్కలపల్లిలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామంలో కంపచెట్లను జేసీబీ సాయంతో డ్రైవర్ తొలగిస్తున్న సమయంలో హెల్పర్ సంతోష్‌కుమార్ (20) ఉన్నఫళంగా కిందపడ్డాడు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న సీఐ ఆంజనేయులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, సంతోష్‌కుమార్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

పరస్పర కేసుల నమోదు

కదిరి టౌన్: స్థానిక వేమారెడ్డి సర్కిల్‌లో సాయి మెడికల్ షాపు నిర్వాహకురాలు పద్మజ, ఆమె భర్త మధుసూదన్ మధ్య చాలాకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఈ క్రమంలో పద్మజతో సన్నిహితంగా ఉన్నాననే అనుమానంతో తనపై మధుసూదన్ దాడి చేశాడని ఫ్రెండ్స్ డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్న ఖాలేష మస్తాన్‌వలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై తన భార్యతో సన్నిహితంగా ఉండడాన్ని ప్రశ్నించినందుకు పద్మజ, ఖాలేష తనపై ఇనుప రాడ్‌తో దాడి చేశారని మధుసూదన్ ఫిర్యాదు చేశాడు. ఇద్దరి ఫిర్యాదుల మేరకు పోలీసులు పరస్పర కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రావత్ దూకుడు.. సంజు మెరుపులు

- సూపర్ సెంచరీతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచిన ఎస్.రావత్
- అర్ధ సెంచరీలతో రాణించిన సంజు, శ్రీకర్ భరత్, రిక్కీ భుయి
- ఇండియా–ఏ 224/7
- ఇండియా–డీ - 306/5



బంతిని బౌండరీకి తరలిస్తున్న రావత్

అనంతపురం: అనంత క్రీడాగ్రామంలో బీసీసీఐ ఆధ్వర్యంలో ఏసీఏ, ఏడీసీఏ సౌజన్యంతో జరుగుతున్న దులీప్ ట్రోఫీ చివరి రౌండ్ మ్యాచ్‌ల్లో ఇండియా–ఏ జట్టు బ్యాటర్ ఎస్.రావత్ సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. దీంతో ఇండియా–సీ జట్టుపై ఇండియా–ఏ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 224 పరుగులు సాధించింది. అలాగే ఇండియా–బీ జట్టుపై ఇండియా–డీ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 306 పరుగులతో భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. ఇండియా– డీ జట్టు బ్యాటర్ సంజు శామ్సన్ 89 పరుగులతో అజేయంగా నిలిచాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మరోసారి డకౌట్ అయి అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేశాడు.

36 పరుగులకే పీకల్లోతు కష్టాల్లోకి

ఇండియా–ఏ, సీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇండియా–సీ జట్టు టాస్ గెలిచి తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. సీ జట్టు పేసర్ల ధాటికి ఇండియా–ఏ జట్టు 36 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయింది. ప్రథమ్ సింగ్ 6, కెప్టెన్ మయాంక్ అగర్వాల్ 6, తిలక్ వర్మ 5, రియాన్ పరాగ్ 2, కుమార్ కుషాగ్రా డకౌట్ అయ్యారు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన ఎస్.రావత్, ఎస్.ములాని బాధ్యతాయుతంగా ఆడారు. అవకాశం దొరికినప్పుడల్లా సింగిల్స్, డబుల్స్ తీసుకుంటూ బంతులను బౌండరీలుగా మలిచారు. జట్టు స్కోరు 123 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఎస్.ములాని 44 (5 ఫోర్లు, 1 సిక్సర్) పరుగుల వద్ద గౌరవ్‌యాదవ్ బౌలింగ్‌లో పటిదార్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆరో వికెట్ భాగస్వామ్యానికి 104 పరుగులు జోడించారు. ఈ దశలో ఎస్.రావత్ దూకుడు పెంచాడు. ఆట ముగిసే సమయానికి 235 బంతుల్లో 122 పరుగులు (15 ఫోర్లు) నాటౌట్‌గా క్రీజులో నిలిచాడు. మరో బ్యాటర్ అవేశ్‌ఖాన్ 16 పరుగులతో క్రీజులో ఉన్నాడు. ఇండియా సీ జట్టు బౌలర్లలో అన్షుల్ కాంభోజ్ 3, విజయ్‌కుమార్ వైశాఖ్ 2 వికెట్లు తీశారు.

పటిష్ట స్థితిలో ఇండియా–డీ

మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గి ఇండియా–బీ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా–డీ జట్టు 77 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్లు దేవదత్ పడిక్కల్, శ్రీకర్ భరత్ అర్ధ సెంచరీలతో చెలరేగారు. తొలి వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 50 పరుగులు చేసిన పడిక్కల్‌ను నవదీప్‌సైనీ పెవిలియన్ దారి పట్టించాడు. మరో ఓపెనర్ శ్రీకర్ భరత్ 105 బంతుల్లో 52 (9 ఫోర్లు) పరుగులు చేశాడు. వన్‌డౌన్‌లో వచ్చిన రికీ భుయి సైతం 87 బంతుల్లో 56 (8 ఫోర్లు) అర్ధ సెంచరీ నమోదు చేశాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మరోసారి డకౌట్ అయ్యాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సంజు శామ్సన్ మెరుపులు మెరిపించాడు. అవకాశం దొరికినప్పుడు బంతిని సిక్సర్, బౌండరీగా మలిచాడు. 83 బంతుల్లో 89 పరుగుల (10 ఫోర్లు, 3 సిక్సర్లు)తో నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ 26 పరుగులతో క్రీజులో ఉన్నాడు. ఇండియా–బీ జట్టు బౌలర్లలో రాహుల్ చహర్ 3 వికెట్లు పడగొట్టాడు. ముఖేష్ కుమార్, నవదీప్ సైనీ చెరో వికెట్ తీశారు.





మ్యాచ్‌ను చూస్తూ కేరింతలు కొడుతున్న అభిమానులు